25 నుంచి స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక

మేడ్చల్ రూరల్: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 4 తరగతిలో ప్రవేశాలకు మండల స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి వసంత కుమారి తెలిపారు. మండల పరిధిలోని విద్యార్థుల ఎంపికలను మేడ్చల్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నామని తెలిపారు. 01-09-2015 నుంచి 31-08-2016 మధ్య కాలంలో జన్మించిన వారు అర్హులని ఆసక్తి గల వారు తమ స్కూల్ బోనఫైడ్, ధృవపత్రాలు, 5 పాస్‌ఫొటోలతో 25న ఉదయం 9 గంటల వరకు మేడ్చల్‌లోని బాలుర పాఠశాలలో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9951008956, 9618526432, 9676730030 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మల్లారెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



మేడ్చల్ రూరల్: మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని శనివారం మేడ్చల్ బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసిన నేతలు పలు విషయాలపై చర్చించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఉపాధ్యక్షులు రఘుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షులు హరత్‌రెడ్డి, నాయకులు యూసఫ్, భాస్కర్, జీవన్ ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

ఏఈ శ్రీనివాస్‌రెడ్డికి సత్కారం



ఏఈ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నాయకులు

ఘట్‌కేసర్: రోడ్డు భవనాల శాఖ మండల ఏఈ శ్రీనివాస్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఆయనను శాలువాతో శనివారం సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని రోడ్ల అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, రామారావు ముదిరాజ్, రవి, నాయకులు సుధాకర్, రాంచందర్ పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు శుభాకాంక్షలు



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు పూలమొక్క అందజేస్తున్న ప్రవీణ్‌రావు

ఘట్‌కేసర్: కేంద్ర సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో శనివారం కలిశారు. కరీంనగర్‌లోని బండి సంజయ్ ఇంటిలో పూల మొక్క అందజేశారు. అనంతరం సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినందుకు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

కీసరగుట్ట ఈఓగా కట్ట సుధాకర్‌రెడ్డి



కీసరగుట్ట ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న కట్టసుధాకర్‌రెడ్డి

కీసర: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశానుసారం నూతన ఈవోగా కట్ట సుధాకర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కీసరగుట్ట ఈఓగా విధులు నిర్వహించిన నరేందర్ కొత్త ఈఓ సుధాకర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నాగలింగం ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌లో వ్యర్థాల నుంచి గ్యాస్ తయారీ



పోచారం: ఇన్ఫోసిస్ పోచారం క్యాంపస్‌లో వ్యర్థాల నిర్వహణను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు శనివారం పరిశీలించారు. వ్యర్థాలను వినియోగించి గ్యాస్ తయారు చేస్తున్న కేంద్రాన్ని సందర్శించి దాని పనితీరును గమనించారు. అదే విధంగా తడి, పొడి చెత్తలను వేరుచేసి, వాటిని కంపోస్ట్ ఎరువుగా ఎలా తయారు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మురుగునీటిని కూడా శుద్ధిచేసి చెట్లకు వినియోగిస్తున్నట్లు ఇన్ఫోసిస్ ప్రతినిధులు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జులై 2న తైబజారు వేలం

బోడుప్పల్: జులై 2వ తేదీన బోడుప్పల్ నగర పాలక సంస్థకు సంబంధించిన తైబజారు వేలం వేస్తున్నట్లు కమిషనర్ రాంలింగం వెల్లడించారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ జులై 16వ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు తైబజారు రుసుం లీజుకు ఇవ్వడానికి ఈ టెండర్ వేస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగినవారు కమిషనర్ పేరిట రూ.10 వేల డీడీ తీసి జులై 1వ తేదీన సోమవారం సాయంత్రం 3 గంటల లోపు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు తీసుకుని, పూర్తి చేసి సమర్పించాలన్నారు.

ప్రత్యేక పాలనే అనివార్యమా..!

- జులై 4తో ముగియనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం
- సర్పంచుల విషయంలో ప్రత్యేక పాలనకే మొగ్గు
- బీసీ జనగణన తర్వాతే ఎన్నికలపై ప్రభుత్వ యోచన
- ఓఆర్‌ఆర్ లోపలి పురపాలికలు, జీపీలు విలీనంపై జోరుగా చర్చ



సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారులోని జిల్లా, మండల పరిషత్ చైర్మన్ల పదవీ కాలం వచ్చే జులై4తో ముగియనుంది. దీంతో వీరినే కొనసాగిస్తారా? లేక ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగిస్తారా? అనే విషయంపై ఆయా మండలాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసింది. అయితే వారి పదవి కాలాన్ని పొడిగించకుండా ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకు శ్రీకారం చుట్టింది.

వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు...

బీసీ జనగణన చేపట్టి ఆ తర్వాత గ్రామ పంచాయతీ, ప్రాథేశిక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా గత ఎన్నికలు జరిగినప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లు పదేళ్లపాటు కొనసాగాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ చట్టం రూపొందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఏ మేరకు నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిన అవసరముంది. ఏది ఏమైనా స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా రానున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని పథకాలు అమలు విషయంలో ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది.

కాంగ్రెస్‌లోకి ఇద్దరు...

నగర శివారుల్లో జిల్లా జడ్పీ చైర్మన్లు ఇద్దరు ఉండగా వీరిద్దరు కూడా బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. శివారుల్లోని రంగారెడ్డి , మేడ్చల్ జిల్లాల్లో మొత్తంగా 42 మండలాలు ఉండగా, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న మండలాలు 26 మాత్రమే ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికల క్రమంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు కొందరు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. శివారుల్లోని కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు మాత్రం ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక పాలన వస్తే అధికారులను తమకు అనుగుణంగా మలచుకొని స్థానిక సంస్థలలో పాగా వేయవచ్చునన్న యోచన వల్లనే ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల అంశాన్ని అక్టోబరు వరకు వేచిచూసే ధోరణితో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఓఆర్‌ఆర్ లోపలి పురపాలికలు, జీపీల విలీనంపై ...

మరోవైపు నగర శివారుల్లోని ఓఆర్‌ఆర్ లోపలి పురపాలక సంఘాలు ,గ్రామ పంచాయతీలను జీహెచ్‌ఎంసీ పరిధిలోకి ప్రభుత్వం విలీనం చేయగలదన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే జీహెచ్‌ఎంసీని మూడు లేదా ఐదు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించవచ్చునన్న ప్రచారం ఉంది.శివారు పురపాలక సంఘాలు ,గ్రామ పంచాయతీల్లో రాజకీయ పార్టీలకు చెందిన నలుగురు గూమిగూడిన ఇదే విధమైన చర్చసాగుతోంది. ప్రభుత్వం విలీనం అంశంపై ఆరా తీస్తుండగా, సంబంధిత అధికార యంత్రాంగం ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నా అధికారికంగా మాత్రం సంబంధిత అధికారులు ధృవీకరించటం లేదు.

అంగన్‌వాడీలకు ఆరు నెలల అద్దె రుసుం మంజూరు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన 26 నెలల అద్దె రుసుమునకుగానూ ఇప్పటి వరకు ఆరు నెలల అద్దె రుసుం మాత్రమే మంజూరైనట్లు జిల్లా మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న 'సాక్షి' మినీలో 'అవస్థల్లో అంగన్‌వాడీలు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. అద్దె రుసుం కోసం బిల్లులు సమర్పించామని, ఇంటి యాజమానుల ఖాతాలో డబ్బులు జమ కాగలవని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఏప్రిల్ 2024 వరకు గౌరవ వేతనం చెల్లించామని, మే నెలకు సంబంధించిన వేతనం అందజేయాల్సి ఉందని తెలిపారు. జిల్లాలోని అన్నీ అంగన్వాడీ కేంద్రాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కూరగాయలు, గ్యాస్ బిల్లులకు సంబంధించి ఫిబ్రవరి 2024 వరకు చెల్లించామని తెలిపారు. ఇంకా మూడు నెలలకు సంబంధించిన కూరగాయలు, గ్యాస్ బిల్లులను త్వరలో చెల్లిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని, పూర్తయిన వెంటనే వినియోగంలోనికి తీసుకొస్తామని తెలిపారు. మరికొన్నింటికి కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు కాగా, ఈ పనులను పంచాయతీ రాజ్ శాఖ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమాచారాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని 5 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతిభావంతులైన బాలలకు, పిల్లల రక్షణ సంరక్షణకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సేవ సంస్థలకు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల ప్రదానం చేస్తున్నట్లు జిల్లా మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు వచ్చే నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

చర్చి నిర్మాణాన్ని ఆపాలి



నాగారం కమిషనర్ రాజేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యనగర్‌కాలనీ సమీపంలో జనవాసాల మధ్య ఎలాంటి అనుమతులు లేకుండా కొత్తగా ఏర్పాటు చేస్తున్న చర్చి నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని శనివారం కాలనీవాసులతోపాటు, పలువురు నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు.

ఘనంగా పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీశ్రీ పోచమ్మ తల్లి 5వ వార్షికోత్సవం సందర్భంగా పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ శనివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ననబోలు రాజశేఖర్ రెడ్డి, చెరుకు మహేష్ గౌడ్, పానుగంటి బృందాకర్ గౌడ్, అల్వాల్ నర్సింహగౌడ్, ముత్యాల గౌడ్, శేఖర్ గౌడ్, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు, నాయకులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో 4వార్డు కిష్టాపూర్‌లోని వీకర్ సెక్షన్ కాలనీలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు, నాయకులు శనివారం మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ సమస్య, సీసీ రోడ్లు వంటి సమస్యలతో కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, సమస్యలను తీర్చాలని కమిషనర్‌ను కోరారు.

ఫొటోలు వైరల్ చేస్తామని బెదిరింపు

కేసు నమోదు చేసిన పోలీసులు

ఘట్‌కేసర్: వ్యక్తిగత ఫొటోలు వైరల్ చేస్తామని బెదిరించిన వారిపై ఘట్‌కేసర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన రియాజ్ అలీ తన మొబైల్‌ను ఘట్‌కేసర్ శాంతినగర్‌కు చెందిన జ్ఞానేశ్వర్ వద్ద తాకట్టు పెట్టాడు. తాకట్టు పెట్టుకున్న జ్ఞానేశ్వర్, రియాజ్ అలీ ఫోన్ లాక్‌ను తెరిచి అతడి స్నేహితురాలి వ్యక్తిగత ఫొటోలను వాట్సాప్ ద్వారా స్నేహితులు హేమంత్ అలియాస్ టిల్లుకు పంపారు. అనంతరం రియాజ్, అతడి స్నేహితురాలి ఫొటోలను వైరల్ చేస్తామని వారు బెదిరించారు. దీంతో రియాజ్ అలీ, స్నేహితురాలు పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఐటీ చట్టం ప్రకారం వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'మౌలాలి ఇండస్ట్రియల్'లో నో ఫుడ్‌సేఫ్టీ

తనిఖీలో వెలుగు చూసిన వైనం

మల్కాజిగిరి: మౌలాలి ఇండస్ట్రియల్ ఏరియాలోని రెండు పరిశ్రమల్లో ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. డి.బి జోషి మసాలా తయారీ కంపెనీలో లేబుల్ లేకుండా ఉన్న 30 కిలోల చింతపండు, 300 కిలోల జీలకర్రను గుర్తించారు. అప్పడాలు తయారు చేయడానికి ఉపయోగిస్తున్న గడువు ముగిసిన బియ్యం పిండిని వాడుతున్నట్లు తేలింది. నిబంధనలు పాటించనందుకు వారికి నోటీసులు జారీ చేశారు. రమాబాయి జోషి ఇండస్ట్రీస్‌లో ఎఫ్‌బీఓలకు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ లేవని గుర్తించారు. కిటికీలు, వెంటిలేటర్స్‌కు పురుగులు రాకుండా నెట్స్ లేవు. కార్యాలయం ఆవరణంలో ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ సర్టిఫికేట్ లేదు. గడువు ముగిసిన పచ్చడి డబ్బాలను కూడా అధికారులు గుర్తించారు.




నాసిరకం పదార్థాలతో తయారైన అప్పడాలు



గడువు ముగిసిన పచ్చడి డబ్బాలు

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



నరేశ్ మృతదేహం

ఘట్‌కేసర్: ఆర్థిక సమస్యలతో ఘట్‌కేసర్‌లో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ప్రకారం... ఘట్‌కేసర్ బాలాజీనగర్‌కు చెందిన గుండు నరేశ్ (36) ఈసీఐఎల్‌లో ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. వ్యాపారం సరిగా నడవకపోవడంతో తెచ్చిన అప్పులు బాగా పెరిగిపోయాయి. అప్పులపై తరచుగా భార్య సుకన్య, సోదరుడు సురేశ్‌తో బాధ పడుతుండేవాడు. ప్రింటింగ్ ప్రెస్ కారణంగా అప్పులు పెరుగుతున్నాయని వాపోయేవాడు. కాగా శనివారం ఉదయం కుటుంబసభ్యులు బయటకు వెళ్లగానే మ ధ్యాహ్నం బాత్‌రూంలోకి వెళ్లి ఇనుపరాడ్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నరేశ్‌ను పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు సురేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సీనియర్ సిటిజన్లకు గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తింపు కార్డులు అందజేస్తున్న చైర్‌పర్సన్ పావనీ జంగయ్య, కౌన్సిలర్ శశికళ

ఘట్‌కేసర్: సీనియర్ సిటిజన్ అసోసియేషన్ భవన స్థలం కోసం కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. శనివారం పట్టణంలోని గురుకుల్ ప్రాంగణంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రంగయ్య ఆధర్యంలో విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీ జంగయ్య, స్థానిక కౌన్సిలర్ శశికళ హాజరై సీనియర్ సిటిజన్లకు గుర్తుంపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులతో పాటు 60 సంవత్సరాలు పైబడిన వారు కూడా అసోసియేషన్ ద్వారా గుర్తుంపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల్ ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, టీజేఎస్ నాయకుడు లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ముదిరాజ్, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకట్‌రాంరెడ్డి, మారయ్య, సోమయ్య, మల్లారెడ్డి, పండిత్, అభిమన్యు, ప్రభాకర్, కృష్ణ, ఎల్లయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



నాగారం ఏడీఈ కిషన్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని గోపికృష్ణకాలనీ, శివశక్తికాలనీ, రవీంద్రనగర్‌కాలనీ, బిఎంఆర్‌కాలనీ, ఎల్లమ్మకాలనీల్లోని నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం కౌన్సిలర్ అన్నంరాజు, సుమిత్ర సురేష్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఏడిఈ కిషన్‌నాయక్, ఏఈ కామేశ్వర్‌రావులకు వినతి పత్రం అందజేశారు. కాలనీల్లో అవసరమైన చోట విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు, అదనంగా విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీవాసులు వెంకటేష్, రామారావు, బాల్‌రెడ్డి, శ్రీనివాసగుప్తా, శ్రీధర్, నర్సింగ్ రావు, సునీల్, మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



అంకుషాపూర్ స్కూల్ వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి కోరారు. శనివారం జిల్లా పరిషత్ అంకుషాపూర్ హైస్కూల్‌ను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థుల సామార్థాలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కరుణాకర్, ఏఈ వెంకట్‌రెడ్డి, వ్యాయాయ ఉపాధ్యాయుడు శ్రీరాములు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి



జవహర్‌నగర్: ప్రస్తుత యాంత్రిక జీవనంలో యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని యోగా గురువు శంకరాచారి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో యోగా గురువు శంకరాచారి ఆధ్వర్యంలో శనివారం విన్యాసాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల అనేక రుగ్మతలను పారతోలవచ్చునని అన్నారు. ఆసనాలు, ప్రాణాయామంతోనే యోగా సిద్ధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా విన్యాసకులు నర్సింహయాదవ్, పద్మారావు, ప్రసాద్, నగేష్, కిషోర్, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



నూతన కమిటీతో ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

శామీర్‌పేట్: శ్రీవిష్ణు శివాలయ దేవస్థానానికి ఎన్నికైన నూతన కమిటీ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామంలోని శ్రీ విష్ణు శివాలయ దేవస్థానం నూతన చైర్‌పర్సన్‌గా ఆడెపు ఉమామహేశ్వరి, కమిటీ సభ్యులుగా బూడిద రవీందర్‌గౌడ్, సామల రాజిరెడ్డి, బురిగల్ల రమేష్‌లను దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు, ఎంసీ పల్లి జెడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి హాజరై కమిటీ సభ్యులను సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరం

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం, యాడారం గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు మహిళలకు సంబంధించిన పరీక్షలు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 112 మందికి పరీక్షలు నిర్వహించి, 34 మందిని ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అంకుష, అనేష, సహజ, నిఖిత, వర్షా, వినయ్, మార్కెట్ ఇంచార్జ్ కుమారస్వామి, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

వందశాతం పన్నులు కడుతున్నా మౌలిక వసతుల్లేవు

- అభివృద్ధికి నోచుకోని విహారి హోమ్స్
- విలేకరుల సమావేశంలో కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్



గుంతలు పడిన రోడ్డును చూపిస్తున్న కాలనీవాసులు

పోచారం: వందశాతం ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు కడుతున్నా విహారి హోమ్స్‌కు మౌలిక సదుపాయలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్ ఆరోపించారు. ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోని విహారి హోమ్స్ అభివృద్ధికి నోచుకోకు అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. శనివారం విహారి హోమ్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం కాలనీలో గుంతలు పడిన రోడ్లను చూపించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వెంచర్ నిర్వాహకులు 2016లో బీటీ రోడ్లు వేయడంతో తాము ప్లాట్లను కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకోడం జరిగిందన్నారు. నాణ్యతా లోపంతో ఆ రోడ్లు తొందరగా పాడైపోయి గుంతలు పడి మట్టి రోడ్లుగా మారాయన్నారు. 2018లో ఇస్మాయిల్‌ఖాన్‌గూడను పోచారం మున్సిపాలిటీలో విలీనం చేసినప్పటి నుంచి విహారి హోమ్స్‌లో ఒక్క అభివృద్ధి పనీ జరగకపోవడం శోచనీయమన్నారు. పాలకవర్గం ఏర్పడి నాలుగున్నరేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు కాలనీ అభివృద్ధికి నిధులు ఖర్చు చేయలేదన్నారు. ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు వందశాతం కడుతున్నా మౌలిక వసతుల కల్పనకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటింటికీ తాగు నీరు అందిస్తామని చెబుతున్న ప్రభుత్వం తమ కాలనీకి తాగునీరు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు కాలనీలోని సమస్యలను పరిష్కరించడంలో స్థానిక కౌన్సిలర్ ఘోరంగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. డ్రైనేజీ, రోడ్ల నిర్మాణాలు చేపడతామని శిలాఫలకాలు పెట్టి శంకుస్థాపనకే పరిమితం చేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.ఈ సమావేశంలో కాలనీ ప్రతినిధులు బాబూరావు, ముకుంద్‌రెడ్డి, డీఎస్‌కే వర్మ, విజయ్ కుమార్, సుకుందర్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.